# అమావాశ్య....పున్నమి

## 1

అవును, భూమి బీటలు వారింది. వసంతకాలంలో రాయలసీమ నవ్వి చిగిర్చలేదు. చిగిర్చక ఆకసంవైపు నిస్సహాయతతో చూసింది. చేతులు ముడిచి ప్రార్థనలు చేసింది. మొక్కజొన్న పండలేదు. పాడి గేదెలు తన్నినవి. చూడి ఆవులు చచ్చిపోయినాయి. జానికిరామన్న సెంచయ్య యింటికాడ నిలిచి, ఆకాశంవంక చూశాడు. సెంచయ్య బయటకు వచ్చి ముఖం చూశాడు. పెద్దయ్యా, కన్నయ్యా, జానికిరామన్న అరుగుమీద చతికిలబడి వెళ్లిపోయారు. పూజారి నంబి కిష్టమాచార్లు మంటపంమీద కూచొని, గుళ్ళో ఆరిపోతున్న దీపం వంక చూశాడు. అగ్రహారంనుంచి వచ్చిన శాస్త్రుల్లుగారు ''అమ్మాయి పెళ్ళి ఈ యేటికి గూడా లేదా?'' అన్నాడు. మాలపల్లెలో కుక్కలు చచ్చి గబ్బు వాసన లేచింది.

పానకాలు తూర్పున పైగా చూసి ''అదేమిటంటావే.... ఆ ఆ నలుపూ? మబ్బులేనంటావా పరంద్రాయ్యుమావాఁ? పైరుగాలి దిరిగింది. మరి పరమాత్ముగి దయ'' అనుకుంటూనే వెళ్లిపోయాడు. మనుషులు మాట్లాడుకొంటున్నారు. కాని ఒకళ్ల ముఖాలు వేరొకళ్ళు చూచుకునే ధైర్యంతోగాదు.

అవును, భూమి బీటలు వారింది. ప్రకృతి శాపంవలె రాయలసీమ బీళ్ళు దేలింది. రాయ లేలిన రత్నాలసీమ, చీనితోటల నల్లభూమి, బంగారుగడ్డ, మా సీమ. ఆకలితో లోకం వంక చూసింది, ఆకాశపు కోపం భరించలేక.

## 2

జానికిరామన్న ఎదురు చూశాడు - ఝామురాత్రి దాకా. రాములు తిరిగి రాలేదు.

''అమ్మా, మాలచ్మీ! బావ జాడ నీకేమైనా దెలుసా?'' అని కూతురు నడిగాడు.

''మాదిగపల్లె బోతానన్నే'' అన్నది మాలచ్మి.

మసిబారిన పాత లాంతరు చేబట్టి జానికిరామన్న వెతకబోయినాడు. మాదిగపల్లె వెళ్ళినమాట నిజమే గాని, చీనితోట వెనక బసవమ్మను పూడ్చిం తర్వాత, రాములు జాడ వాళ్ళెవరికీ యెరుకలేదన్నారు.

జానికిరామన్న యీడ్చుకుంటూ చీని తోటకు దారి తీశాడు. చీకట్లో బావురుమంటూ తోట, పాడుబడి దేబిరిస్తున్న ఏతామూ, ఎండి నలిగి రాలిపో తూన్న కొత్త కంచె. "రాములూ!" రాములు పలకలేదు. దయ్యాలు ప్రతిధ్వనించి నట్లు తిరిగి కేక వినవచ్చింది. ఎన్నడూ, ఎప్పుడూ, ఎందుకూ భయపడని జానికిరామన్న వెనుదిరిగి వచ్చాడు. రాములు కనబడలేదు. మాలచ్మి ఏడ్చింది. పాత లాంతరుగూడా చమురులేక ఆరిపోయింది.

కన్నయ్య పొద్దున్నే అరుగుమీద కూర్చొనివున్నాడు.

''రాములు రాలే" అన్నాడు లోపలినించివచ్చిన జానికిరామన్న.

''హఁ! ఏడకు బోయినట్టు?"

పెద్దయ్య, కొడుకు వరదరాజు, కోడలు పార్వతమ్మ, ముసలమ్మ సుబ్బమ్మ, యిద్దరు మనుమరాళ్ళూ అంతా నెత్తిమీద చిన్న చిన్న మూటలు గట్టుకొని, జానికిరామన్న యింటిమీదిగా కడపబోతున్నారు. పెద్దయ్య ఆగాడు. "నీ యింటి కొచ్చిన పర్వాయేంలేదు పెద్దయ్యా!" అన్నాడు ముందుకు వచ్చి జానికిరామన్న. పెద్దయ్య కళ్ళుమూసి తిరిగి తెరిచాడు. చెమ్మదేలి ముసలికళ్లు ముందును నమ్మలేక దుఃఖిస్తున్నాయి. ముసలి పెద్దయ్య నడిచి వెళ్ళాడు.

మాలచ్మి పరుగెత్తుకుంటూ వెళ్ళి పార్వతమ్మ బుజాన చెయ్యివేసి-"అప్పా! మళ్లెప్పుడొచ్చేది?" అని కళ్ళల్లోకి చూసింది. పార్వతమ్మ ఆకాశంవేపు చేతులు చూపింది.

"మా బావ గనబట్టంలేదు రాత్రికాడనించీ. కడపలో జూస్తే యింటికి బంపండి పెద్దామా."

సుబ్బమ్మ పెద్దమ్మ, పార్వతమ్మ, వరదరాజులు మాలచ్మి వేపు చూశారు. తిరిగి ప్రయాణం సాగింది.

# 3

మూడు నెలలు. నాలుగు. ఆరునెల్లు రాములు తిరిగి రాలేదు.

వానలు కురిసినట్లే కురిసి తిరిగి కోపం వహించినవి. జానికిరామన్న శ్రీశైలం దేవుడికి మొక్కుకొన్నాడు. మాలచ్మిని కన్నయ్య పెళ్ళాం గ్రామ దేవతకు చద్దిబెట్టమన్నది. కాని జానికిరామన్న చీని తోట దిగాలుమంటూనే వుంది. మాల పల్లెంతా కడుపు చేతబట్టుకొని కోస్తా జిల్లాలు చేరబోయింది. పట్నంనించి మిల్టరీ యింజనీర్లు వచ్చి తోటలో నుయ్యిజూచి పెదిమలు విరిచి వెళ్ళిపోయారు. రాములు లేని తోట యింకేం తోట? మాలచ్మి చిక్కి సగమై పోయింది. నిద్రలో నడచినట్లుగా నడుస్తున్నది. "బువ్వ మొకం గొట్టినట్లుగా" ఒంటిపూటగూడా గంజి ముట్టటంలేదు. వరదరాజులు ఉత్తరం రాయించాడు. ముసలి పెద్దయ్య బేదులతో చచ్చిపొయ్యాడని. ఇంటికి గొట్టిన కంపను గురించే కలవరించాట్ట. కన్నయ్య వానల్ని నమ్మి జొన్నలు చల్లాడు - ఒంటిదున్నతోనే అరకదున్ని.

అగ్రహారంనుంచి శాస్తుర్లుగారు పంచాంగం చంకలో బెట్టుకొనివచ్చి "జానికయ్యా, యీ ఏడైనా పిల్ల పెళ్ళి తలపెట్తావా? యిఖ వరుణదేవిడికి దయ గలిగిందిలే."

జానికిరామన్న మంచం మీదినించి లేచి కింద కూర్చొని - "రా....ము.... లూ!" అన్నాడు. కన్నయ్యవచ్చి శాస్తుర్లుగారికి సంగతి జెప్పాడు. శాస్తుర్లుగారు లేచివెళ్తూ - "ధాతకరువూ, డొక్కలకరువూ నయం జానికయ్యా, అప్పుడు వూర్లు పాడుబడలేదు" అన్నాడు.

రాములు ఎందుకు బోయినట్లు? ఎక్కడకు బోయినట్లు? జానికిరామన్న ప్రశ్న అడుగుదామని లేచినవాడల్లా కళ్ళ నీళ్ళు దిరిగి తిరిగి కూలబడ్డాడు. మాలచ్మి వచ్చి భుజంమీద వాలి వెక్కి వెక్కి యేడ్చింది. చీనితోటంతా తానేయై చిందులుతొక్కి, ఏతాం లాగి, నీళ్ళు దోవలు గట్టి, బత్తాకాయలకు సంచులు గట్టి, కొత్త మొక్కలకు ఎఱువు వేసి, మాలచ్మితో మల్లికార్జునిడి మీద పదాలు గట్టి, వంచె ఎగదట్టి, పట్నం నుంచి బొంబాయిరేవుకు బోయే మెయిలు బండికి లగూదీసి, చీని నారింజలు పెట్టెల్లో అమ్మి... రాములు చెయ్యని పనేముంది? "నా కంచం తిరగబడ్డది. నా కళ్ళు పోయినై రా కన్నయ్యా!" అని జానికిరామన్న

ఏడ్చాడు. కరువొచ్చి పెళ్ళి నాగాలు పడ్డం - ఈ యేడని, ఆ యేడని, వచ్చే ఏడని, పైవచ్చే ఏడని. రాము లనేవాడు - "నా పెళ్లాం నా యింట్లోనే వుండే, కన్నయ్య బాబూ!" కన్నయ్య నవ్వి "అరి నీ చిగ్గొయ్య గం|్రా! ఆ మూడు ముళ్ళుబడందీ మాలచ్మిని పెళ్ళం గిళ్ళం అనేవు గనక. తిరగమాత గరిటె గాలిందాకా మా పిల్ల అంటిస్తది" అని భయపెట్టేవాడు. తోటకాడి కొచ్చిన పళ్ళసాయిబులు వందకు పావలా ఎక్కువిస్తామన్నా, రాములు వినిపించుకోక, పెద్దగంప నెత్తినేసుకొని మెయిలువేళకు చద్దిబువ్వ దిని పరుగులు దీసేవాడు. "మావా! చేస్తే రైల్లో వుద్యోగమే జెయ్యాలే" అనుకొంటూ జేబులు గలగల్లాడించు కొంటూ యిల్లు జేరేవాడు. "నువ్వు జదివిన చదువుకం|్రటా" అనేవాడు జానికయ్య.

"ఓస్సి. యింజేను నడిపేందుకేం సతుకులో?"

మాలచ్మి మామ అల్లుళ్ళ వరస విని నవ్వుకొనేది. అమ్మా నాన్న కరువైన రాములూ, తల్లిలేని మాలచ్మి - నువ్వు చిలకంటే, నువ్వు గోరింకవి పెరిగారు.

* * *

కరువు ముదిరి, చీనితోట చింతలపాలు కాగానే రాములు కాళ్లు విరిగి పోయినై. రైలుదాకా పోయి ఒట్టి కళ్ళతో బొంబాయినించి వచ్చి పోయే ప్రయాణీకుల్ని చూస్తూ, తిరిగి యింటికొచ్చి, కాళ్ళు నిలవక తోటదాకాపోయి, బావిలో తొంగి చూచి, నిస్పృహతో ఏతాం వూపి జూచి, మంటపం దగ్గర దిగులు కబుర్లు విని....ఏమిటీ జీవితం? ఈ బతుక్కి ఏమని అర్థం? అనుకొనే వాడు. తరిగి మురిగి మిగిలిన జొన్నలు మూడు కుంచాలకు దిగడినై. జానికి రామన్నవంక రాములు ఒకటి రెండుసార్లు చూశాడు.

''కడపలో ముత్తాలుకు పని దొరికిందట!''

''ఏం పని?'' అని తిరిగిచూశాడు జానికయ్య.

''పెక్టరీలో.''

''నమ్మకురా!''

''జొన్న లయిపోతున్నై....మామా!"

''అందుకని పుట్టిన గడప వదలి పెట్టామం|్రటా....రాములూ?''—

''సద్దామంటావా?....''

''చచ్చేదెందుకు? ఎన్ని కరువులు నూడ్లేదురా, రాములూ? మా తాత డొక్కల కరువులో ఆద్చాడు. మా అయ్య ధాత కరువులో జద్చాడు. అందుకని నమ్ముకొన్న నేలనా వదిలేది?"

''గుంటూరుబోయిన జనం వుప్పోగంజో తాగి బదకటం లేదంటే?''

"భూమి బోయింతర్వాతనంటరా బదుకు రాములూ? బలుసాకు తిని బదకటం బదకటమేనా? ఈ బదుక్కు ఏమన్నా వుంటే ఈ నేల్లోనే వుంది. ఈ నేలకోసం పుట్టాం. ఈ నేలను నమ్మాం. నమ్మినవాళ్లకు నాశనం లేదు.''

''మీ తాత? మీ అయ్య?....''

''వాళ్ళు మనుషులు.''

ఆ మాట తర్వాత రాములు నోరు మెదపలేదు. దిగులుగా కూచున్నాడు. ఆ పొద్దు రోట్లో మాలచ్మికి సాయిదాగా జొన్నల్లో పోటు వేశాడు. బసవమ్మ మేత లేక చావగానే, మాదిగపల్లెకు బోతానని పోయాడు. పోయేటప్పుడు - మాలచ్మి, బావగడ్డం పుణికి - ''కోపమా?'' అంది. ''ఉహూఁ!'' అన్నాడు పిల్లడు. మాలచ్మి నవ్వుకొంది. రాములు నవ్వలేదు. తిరిగి కనబడనూ లేదు. ఆరు నెల్లయింది.

## 4

కొండలమీద వానలుగురిసి వాగులోకి, యీ నాలుగేళ్ళకు మొదటి సారిగా కొత్తనీళ్ళు వచ్చినై. పాత జమ్మి, దుబ్బుగడ్డి, ఎండు తాటివిత్తులూ, గులకరాళ్ళు కొత్త నీళ్ళతో కొట్టుకువచ్చినై. కన్నయ్య చెరువుకు గండిగొట్టి వాగునీళ్ళు నింపేందుకు పదిమందినీ పోగుజెయ్యటానికి వూళ్లోకి పోయాడు. కన్నయ్య చిన్నకొడుకు గండికొట్టేచోట చొక్కాలేకుండా నిలబడి వాగులో ఒండ్రుదునీళ్ళనుండి దుబ్బుగడ్డి లాగుతున్నాడు.

''ఉస్స్....రాములన్న!"

కట్టమీదికెక్కి, కొత్త పైపంచె ఏశ్కాదేసుకొని నవ్వుకుంటూ నడుస్తున్న సన్నకారు మనిషి రాములు.

కన్నయ్యకొడుకు నాగేంద్రం, చేతిలో తడిదుబ్బు వాగునీళ్ళలో పారేసి, కొత్తగా వచ్చిన బలంతో జానికిరామన్న యింటికి పరిగెత్తి, గుక్కదిప్పకోకుం

డానే ''వచ్చాడు మాఁవా! నిజం! సత్తెం! వచ్చాడు! నేం జూస్తే!'' అని దబా యించసాగాడు.

అప్పటికి జానికిరామన్న మంచానబడి నెల దాటిపోయింది. కొంచెం మూలిగి జానికయ్య ''ఎవర్రా, నాగేంద్రం'' అని అనగలిగాడు.

''ఎవరేందే? రాములన్నైతే?''

మాలచ్మికి ఆ మాటలు వినబడి పైట సర్దుకొంటూ పరుగుదీసింది. ఆ మాటలంటుండగానే పెద్ద అంగల్తో రాములొచ్చాడు - పెళ్ళలు విరిగిన అరుగులు జూస్తూ. మాలచ్మికి మూర్చ వచ్చినంతయింది. కన్నయ్య కొడుకు నాగేంద్రంకు అదా ''బక్షీసు'' దొరికింది. ఊరంతా గప్పుమంది.

*　　　　*　　　　*

శాస్తుర్లుగా రొచ్చి లగ్గం అన్నాడు. కన్నయ్యన్నట్లుగా మూడు ముళ్ల వేస్తానన్నాడు రాములు. తంతే గారెలబుట్టలోబడ్డాడు రాములు.

'ఆరి చిచింద్రిగా! కబురు లేకుండా బోయినావ్! మీ మాఁవ జచ్చినంత పనయిందిగందా!" అని కన్నయ్య సంతోషంతో కసిరాడు రాముల్ని.

''రైల్లో గేటుకాడ పనయిందే, చిన్నయ్యా!''

''అనుకొంటినే అనుకొంటినా! యాడా చెప్పినావు గాదు.''

''పట్నంకాడ కొత్త చీమెంటు పాక్టరీ గడుతుండ్రే అడనే, గేటుకాడ.''

''జీతం మాట?''

''నలబై.''

''నీ తస్సాదియ్యా!''

రాములికి పెళ్ళయింది. మాలచ్మి మూడు ముళ్ళేసుకొని రాముల్ని జూసి తొలగిపోతున్నది జానకిరామయ్య ''యీ యేటిగ్గూడా చితికినట్టే. వచ్చే నాటికి'' అన్నాడు మొదట్లో. ''డబ్బుకు జూడద్దేమావా'' అని సంచీ చూపించాడు రాములు. ''తొందర'' అన్నాడు జానికయ్య. ''వుద్దోగం బోద్ది'' అని రాములు.

రాములికి పెళ్ళయింది. వాగునీరు చెరువుకు బెట్టారు. కన్నయ్య మళ్ళీ జొన్నలు జల్లాడు. భూమి మీద బీటలు మూసుకున్నై. అగ్గిగాలి చల్లారింది. రాయలసీమగూడా నవ్వింది.

"చెలవై పోయింది" అని రాము లంటుండగానే, జానికిరామన్న - చిక్కి, బేదుల్తో సగమై, కళ్ళలో ప్రాణం బెట్టుకొన్నవాడు - కొయ్యబారిపోయాడు. "చీనితోట....రా....ము....లూ" అంటూ ప్రాణం బోయింది. కన్నయ్య వచ్చి తలకింద దీపం బెట్టాడు.

పెద్ద దినం అయిపోగానే, చీనితోటను బేరానికి బెట్టినాడు రాములు. "దమ్మిడీ రాదు పాడుబడింది. చుద్ద దండగ" అంటూనే కోమటి సీతయ్య తోటను నాలుగోవంతుకు కట్టుకొన్నాడు. తోట నమ్మి, జానికిరామన్న దినం అయిపోగానే రాములు, పట్నం బయట కొత్త సిమెంటు ఫాక్టరీ దగ్గర్లో, రైలు క్రాసింగు మీద గేట్లు మూసి; లారీలను, జనాన్ని, గేదెల్ని పల్లెటూరి బళ్ళనూ, రైళ్లకింద బడకుండా రక్షించను వెళ్లిపోయాడు. కొత్త మాలచ్మి ఉద్యోగస్థుడి భార్యగా వూరు విడిచింది- తండ్రీ, తోటా లేని ఊరు.

# 5

వంకర్లు తిరిగి తిరిగి పట్నం రోడ్డు రైలు పట్టాలకడ్డం వచ్చింది. ఆ రైలు రోడ్డుక్రాసింగు దగ్గరే రాములు గేటు. గేటుకు తూర్పుగా అరఫర్లాంగులోనే గుజరాతు మర్వారీసేఠ్లు కట్టించిన కొత్త సిమెంటు ఫ్యాక్టరీ. రైలుపట్టాలకు పది గజాల్లోనే రాములు - రైలుయిల్లు. కొంచెం తలెత్తితే పట్నంలో మేడలు, కోర్టులు, సినిమాలు - మాలచ్మికిగూడా కనబడేవి. ఒక పక్కనుంచి, ఇంకొక పక్కన మిల్లు కూలీలు గట్టుకొన్న ఎగుడుదిగుడు గుడిసెలు, పాకలు, రిక్షావాళ్ళ అద్దె పూరి కొంపలు. దూరంగా ఒక్క జువ్విచెట్టు. యింజెన్నుంచి పొగ బొగ్గునుసి, రోడ్డుమీది నుంచి కార్లు, లారీల దుమ్ము - మాలచ్మికి కావలసినంత చాకిరి. రాత్రింబవలు సందడి.

రైలింట్లో కొత్తగా కాపరం బెట్టినరోజున, కొత్తకుండ పొయ్యిమీద బెట్టాండగా మాలచ్మికి గేటుమీది గంట గణగణా వినొచ్చింది. రాములు ఆదరాబాదరా లేచి, నీలి చొక్కా తగిలించుకొని, పచ్చజెండా ఎర్రజెండా చంకలో బెట్టుకొని, ఉప్పెనల్లే వెళ్ళి, లారీలు పోతున్నా లక్ష్యం జెయ్యక గేట్లు దబాయించి మూసేశాడు. లారీ డ్రైవర్లు హారన్లు కొట్టారు. తనకు గాదన్నట్లుగా రాములు అటు తిరిగి గూడా జూడలేదు. ఇంతలోనే రైలు వచ్చింది - పెద్దకూత కూసి. మళ్ళీ గేటుమీది గంట. రాములు గేట్లు మూసిన వాటిని తెరిచేశాడు. మాలచ్మి భయంతో వణుకుతూ యీ చర్యంతా చూసింది.

''చూశావా, ఎక్స్‌ప్రేసు.''

''ఏడకి బోద్ది?''

"బొంబాయ్."

''ఆఁ!''

''మరేందనుకొన్నావ్?''

"మరి ఆ లారీవోళ్ళు అట్లా అరగంట నిలబడ్డారే. అళ్ళకు కోపం వస్తే?"

"ఆస్సి ఆళ్ళ కోపం. మనం రాజులనుకో ఆ కాంత సేపు."

మాలచ్మి భయం పోయింది. ఆ లారీ వాళ్ళకు దమ్ములేవు. రాములు నీలి చొక్కా, ఎర్రజెండా జూడగానే వాళ్ళ యింజెన్లు ఆగిపోవా, మరి?

మళ్ళీ యింకో బండి. పెద్దది. జనంలేని ఘోషా పెట్టెలు. "మాల్‌గాడీ" అన్నాడు రాములు.

"ఏడకు బోద్దో...."

"ఏడకంటా....ఓస్సి....ఒక దిక్కేంటి? నాగపోర్, డిల్లీ, డేరాడూన్...." తన అబద్ధాలకు తనే లోలోపల నవ్వుకొన్నాడు రాములు.

''నిజం?'' అంది పెద్దకళ్ల చేసుకొని మాలచ్మి.

''నిజం!'' అన్నాడు చిన్న కళ్ళ రాములు

* * *

మాలచ్మికి కొత్తపోయింది. కొత్తతో వింతగూడా. నిద్రబోతూనే రైలు కూతలు వినాలి. రాములు ఆదుర్దాతో తిండి తింటాడు. నిద్రగూడా కునికిపాట్ల నిద్రే. గంట మోగితే ఉలిక్కిపడి లేచి వెళ్తాడు. ఎక్స్‌ప్రెసు, మెయిలు, గూడ్సులు, పాసెంజర్లు నల్లగా రాక్షసి బొగ్గుతో యిల్లంతా బూజుగొడుతూ, తిండిలో బొగ్గు లేరుకొంటూ.... మాలచ్మి మంచిమంచి వంటకాలు చేసి రాములికి పెట్టింది. ఇక్కడ చల్లచుక్క గూడా కొనుక్కోవాలి. అర్ధణా బెడితే గిద్దెడు నీళ్లు రాలేదు. రైళ్ళకూతలకు తోడు సిమెంటు ఫ్యాక్టరీ సైరెన్లు ఇది బందయినపుడు అది కూస్తుంది. చెవులు చిల్లులు పడతాయి. మాలచ్మికి ఒక్కోసారి యేడుపొచ్చేది పొద్దున్నే లేచి, తిరిగి నిద్రబోయిందాకా, నిద్రలో, తెల్లవార్లూ యీ కూతలు వినాలి. అర్ధణా బెట్టినా గిద్దెడు చల్లచుక్క రాలని దేశం. కరువులో గూడా వాళ్ల ఊళ్ళో చల్లమ్మకొన్న గర్భాభ్రతపు అమ్మలేదు. రాములుగూడా

మాలచ్మికి కొత్త వదలగానే, యింటిసంగతి మరిచిపోయినాడు. మొదట్లో అయితే యింత మడిజేసి యింటివెనక వంగలు వేసింది మాలచ్మి. కాని, గేట్లు మూసినప్పుడు లారీ డ్రైవర్లు బీడీలు కాల్చుకుంటూ దిగి, వంగతోటను ధ్వంసం చేశారు. రాత్రిళ్లు మిల్లు కూలీ జనం మిగతావాటిన ఒకటి అర కాయబడితే దొంగి లించారు. ఎంత ఎదురుజూసినా, బొగ్గుదుమ్ము కళ్ళతో గంటల గణగణా రైళ్ళు కూతలూ, సిమెంటు ఫ్యాక్టరీ సైరెన్లూ ఎన్నిసార్లు తిరిగి తిరిగి లెక్కించినా మాలచ్మికి పొద్దుపోయేది గాదు. రెండు పొట్టల వంట అంతలోనే అయి పోయేది. అయిపోయిం తర్వాత? రాములు సీలిచొక్కా గుండీలు తెగిపోతే కుట్టేది. గుండీలు రోజూ తెగేవి కావు. మాలచ్మి రాములుకోసం కూచునేది. రాములు పట్నం కబుర్లు జెపితే - అంతలోనే అంత పొద్దు కూలేది. కాని, రాములు కొత్తగా నేర్చుకొన్న బీడీలతో, ఫేక్టరీ వాచిమన్లను బిలిచి గప్పాలు గొట్టుకొంటున్నాడు.

* * *

మాలచ్మి వచ్చింతర్వాత రాములు సెలవదీసుకోలేదు. ఒక రోజున ''మాలచ్మీ, పట్నం బోయి యియ్యాళ యింటిసామాను దెస్తాను. సాయంత్రం సెలవుమీద బోతాను'' అన్నాడు. తన్ను గూడా రమ్మంటాడని మాలచ్మి ముని వేళ్ళమీద కూచొంది. రాములు అన్లేదు.

మాలచ్మి ఒంటరిగా రైలింట్లో నల్లబారిన పెంకుకప్పు జూస్తూ మంచం మీద పడుకొంది. రాములు చోట్లో గేట్లుమూసేందుకు పట్నంనుంచి గామాలు యింకో మనిషి వచ్చాడు. ఎక్సుప్రెసు పోగానే ఆ మనిషి, కోరగా మీసాలు దువ్వుకుంటూ వచ్చి - మంచినీళ్ళడిగాడు. మాలచ్మికి ఆ చూపు నచ్చలేదు. ''మావూరయితేనా? నడ్డిమీద వడ్డించేదాన్ని'' అని అనుకొంటూనే నీళ్ళందిం చింది. నీళ్ళుతాగి, కోరమీసాలు పోకుండా నిలబడి ఆ మాటా, యీ మాటా ఆడాడు. ఆ మాటలకు మాలచ్మి సిగ్గుపడింది. కోపం వచ్చింది. బస్తీవాళ్ళు మంచివాళ్ళుగాదు.

రాములు అర్ధరాత్రికిగాని రాలేదు. "బయస్కోపు కెళ్ళినాం. తమిళం. ఓస్సి. మంచికత్తిసాములే" అంటూ మాలచ్మికి సామాన్లందించాడు. మాలచ్మికి వళ్లు మండింది.

అన్నంబెట్టి ''ఆ మనిషి మంచోడుగాదు''అంది - మూతి అటు తిప్పుకొని.

రాములు ముద్ద నోట్లో గుక్కుకుంటూ ''ఓస్సి-ఆడు మంచాడు గాదని నువ్వనాలి. ఆడుగాదా నాకీడవుద్యోగ వుందని జెప్పింది మొదట్లో. ఆడికి తెలుగు రాదులే. అరవపోడు'' అని ముగించేశాడు. రాములికి అర్థం కాలేదు. మాలచ్మి అర్థం విరిచి చెప్పలేకపోయింది. రైళ్ళకూతలమధ్యనే నిద్ర వచ్చింది.

వచ్చేవారం రాములు మళ్ళీ వెళ్ళాడు పట్నం.

''యివ్వాళ యారి మొగం జూశానో'' అనుకుంటూ తిరిగి వచ్చాడు.

''ఏమయింది?''

''అయిదు రూపాయలు నష్టం.''

''పో....యిందా?'' అని మాలచ్మి భయపడింది.

"ఓస్సి....నీకేం దెల్సు? సట్టాలో గట్టినాం నేనూ ఫేక్టరీ వాచిమేనూ గల్సి. పులుసులో గలిసిపోయింది."

"—మ....రి...."

''మరీ లేదు గిరీలేదు'' అని చికాకుగా అన్నాడు చివరకు రాములు. మాలచ్మి మాట్లాడలేదు. వణుకుతున్న చేతుల్తో రైలు దీపం ముట్టించి రాములు చేతి కందించింది. మాలచ్మికి రాములుదగ్గర వాసన గొట్టింది.

## 6

ఆ పైనెల్లో మాలచ్మికి దమ్మిడీ యివ్వలేదు రాములు.

''జీతమంతా అయిపోయింది....ఖలాస్'' అన్నాడు.

మాలచ్మితో గొల్ల చల్లమ్మి పోట్లాడింది. ఒక పూట తిని, పాత గుడ్డలు ముందరేసుకొని కుట్టుకుంటూ కూర్చొన్నది. సాయంత్రం రాములొచ్చి "నీ కంటె యిటు దేవే మాలచ్మీ!" అని చెయి జాపాడు. చీనితోట అమ్మగా వచ్చిన రొక్కంతో కానుల కంటె జేయించుకొన్నది మాలచ్మి.

"ఎందుకో!"

"పనుంది. యిటుదే?"

"నే నియ్యను. మా అయ్యసొమ్ము" అంది మాలచ్మి. మాలచ్మి చేతులు యే ప్రయత్నం చేయకుండానే మెడలో కంటెను గట్టిగా లంకించుకొన్నవి.

ఎందుకు కంటె అడిగాడో మాలచ్మికి తెలుసు. నిన్న సాయింత్రమే ఫేక్టరీ కొత్త వాచిమేను పెళ్ళాం చెప్పింది - అయ్యలంతా గలిసి సత్తా ఆడుతున్నారంట.

రాములు ఒకడుగు ముందుకొచ్చి, "నీ పాణం దీస్తా, జాగర్త! ఒళ్లు గాపాడుకో" అని బెదిరించి వెళ్ళిపోయాడు. రాము లన్నం దినలేదు. మాలచ్మి దిగులుతో, భయంతో జువ్విచెట్టు కిందికెళ్ళి కూచొంది. ఎవరితో చెప్పుకొంటుంది? ఈ బస్తీ జనం నిద్రలేచింది లగాయితు ఎవరి బదుకు వాళ్లు చూసుకోటాని కలవాటయిపోయినారు. పక్కింట్లో హత్య జరుగుతున్నా పట్టించుకోరు. కొత్త వాచిమేను పెళ్ళాం, తనలాగా పల్లెటూరునుంచి వచ్చిన పిల్లే. కాని, వాచిమేను జూస్తే కొడతాడు.

చీకట్లో పాలెం డొంకలో తల విరబోసుకొన్న పొడుగు దయ్యంవలె జువ్విచెట్టు నిల్చివుంది. ఎందుకు తనిక్కడికి వచ్చింది? చీనితోట, రాములు బావ, బసవమ్మ పాలు, చెరువు నీళ్లు, ఏతాము, నాయన - ఏవీ, ఒకనాడు మురుసుకొన్న యీ సొమ్ములు? వీటికి బదులు పీడకల తర్వాత భయంలాగా రైలుకూతలు, దుమ్ము, ఫేక్టరీ సైరెన్లు, లారీల కంపు, నల్లగా మసిబారిన కొంప, ప్రాణం దీస్తానని బెదిరిస్తున్న మొగుడు. ఆలోచనలతో మాలచ్మి వణికి, జువ్వి చెట్టు నీడను గూడా జూడలేక, కన్నీళ్లు తుడుచుకున్నది. బావ ఉద్యోగం అంటే ఏమిటో ననుకొని కన్న కలలు యిప్పుడు యీ ఆకలి రోగం, నిరాశ ముందు బలి అయిపోయినాయి. బావ జూదం ముందు పాత కలలు. మాలచ్మి కళ్ళెర్ర బడ్డవి. తోటలో నిమ్మనీడ కింద చాకిరీ నొప్పులన్నీ మరిచి, బావ తల్లో పేలు జూసిన మాలచ్మికి తనకేనా బావను జూస్తే ప్రాణభయం? ప్రథలుగట్టే రోజున బావకు తలంట్లుబోసి, కొత్త పంచెలు గట్టబెట్టి, కుంకంబొట్టు కల్యాణంగా బెట్టి, శ్రీశైలం సాగనంపిన తననేనా, బావ "జాగర్త, ప్రాణం దీస్తా" నన్నది? కలలో, పనిలో, ఉషలో, నిశలో తన బావ రాములు ఒకనాడు. మరిచి, విరిచి మాట్లాడే యీ బావ రాములు? తన చెప్పులు మోసి, తనను నీడగూచోబెట్టిన పాత బావలో యీ రాక్షసుడెట్లా ఉద్భవించాడు?

*                *                *

మాలచ్మి వెళ్ళి బావను వెతికింది. గేటు పక్క ఇనపకడ్డీల మీద గూచొని రైలుకట్ట మీదికి గులకరాళ్ళు విసురుతున్నాడు తదేకధ్యానంతో. మాలచ్మి ముందు నిలిచి, తన కంటె తీసి బావ ఒళ్లో నెమ్మదిగా వుంచింది.

"కంటె గావాలంటివే?''

రాములు నమ్మలేదు. భిత్తరపోయినాడు. మాలచ్మివంక చూడబోయి కళ్ళు. వాల్చుకొన్నాడు.

"వద్దు. .." అనగలిగాడు చివరకు.

"కావాలని ...?"

రాములు తనలోని మానవుడి వైపు, రాక్షసుడి వైపు చూచుకొన్నాడు

''ఈ ఒక్కసారి అడతా. రాచిమేను జెబుతున్నాడు. అడికి అంకె దెల్సిందంట. మన పోయిన డబ్బుతో అంతా రావాలి. నీకు చీరెలు దెస్తా మాలచ్మి! ఓస్సి - నవ్వావులే.... అద్దిగో....నవ్వినావులే "

రాములు డ్యూటీ అయిపోగానే మాయమై తెల్లవారుఝాము కొచ్చి తలుపు దట్టాడు. మాలచ్మి లేచి వట్టి చేతుల రాముల్ని చూసింది. దావదగ్గిర మొదట్లో కొట్టిన సారాకంపు గొట్టింది.

మాలచ్మి కంటె సంగతి అడగలేదు. కాని, తన మూర్ఖత్వాని కది అవమానంగా పెంచుకొన్నాడు రాములు. మాలచ్మికి తన్నులు దప్పలేదు. మట్టి గాజులన్నీ చిట్లిపోయినై, తలమీద బొప్పులు గట్టినవి.

మళ్ళీ కొద్ది రోజులు రాములు మారిపోయాడు. జీతం రాగానే మాలచ్మికి రెవిక గుడ్డలు కొన్నాడు. కన్నయ్య చూడనొస్తే మంచి మర్యాద జేశాడు.

మాలచ్మిని మంచి జేసుకోబోయి ''రైలోళ్ళందరు సమ్మె గడతారంట. ఆ యెదవల్తో నేం గల్సేదిలేదు" అన్నాడు ఒక రోజున.

''ఆళ్ళందరూ ఎదవలేనా?'' అని మాలచ్మి అమాయికంగా అడిగింది.

''కాక మరి?''

కాని,సమ్మె రోజున తను గూడా గేటు వదిలిపోయ్యాడు. సమ్మెలో రాములుద్యోగం పోవాలని మాలచ్మి మొక్కుకుంది. ఈ దరిద్ర వుద్యోగంబోతే మళ్ళీ ఊర్జేరి, చిన్నతో చేసుకొని, పాత రోజులు అనుభవించవచ్చు. కాని, సాయంత్రానికల్లా సమ్మె లేదని తెలియవచ్చింది.

* * *

రాములు ఊదాలకు పోవటంలేదు. కాని, రోజు రోజుకూ బస్తీ మనిషై పోయాడు మాలచ్మికి రెవికలు గొన్నాడు, మనసు కొనలేదు.

మాలచ్మి యింటి దిగులుతో కుంగిపోయింది. ప్రకృతిని పిలిచింది. రైలు దుమ్ము, ఫేక్టరీ కుళ్ళులో జీవితమంతా మురికై మురిగిపోగా, తన బావ ఊదరై, పలకరించే దిక్కులేక! హృదయమిచ్చి మాట్లాడే మనుషుల్లేరు. తను చీని తోటలో ఏతాం సంగతి చెప్పితే అర్థంజేసుకోగల అప్పుల్లేరు. చెట్లూ, డొంకలూ, వాగూ, చెరువూ, చీని తోటలూ, చిన్ని దూడల చెంగణాలు,పొద్దున్నె పిట్టలూ, ఎద్దుల మెళ్ళో మువ్వలూ, హరిదాసు కీర్తనలూ, గొబ్బెమ్మలూ, రేగడి పెరుగూ - యిక్కడెక్క డున్నై? వాటి నెప్పుడైనా చూచి, పొంది, ఆనందించిన వాళ్ళొక్కళ్ళూ కన్పించలేదు మాలచ్మికి.

మాలచ్మికి ఎక్కడా దగ్గర్లో దేవుడి గుడి కనిపించలేదు తమ ఊళ్ళో పూజారివంటి నంబినామాలూ చూడలేదు....యిక్కడ కొచ్చిం తర్వాత. పండగలకి యిల్లంతా పాటిమట్టి పూతబూసి, మందంగా పేడతో అలికి ముగ్గులు బెట్టటాని కిక్కడేముంది?

పార్వతమ్మొదినా, ముత్యాలుగారి సూరీడు, కవల పిల్లలు సీతమ్మ, రాజమ్మ - ఒకనాటి తన స్నేహితురాళ్ళు, పందేలేసుకొని చెరువునించి నీళ్ళు మోసుకురావటానికి, వెన్నెల్లో మొగ్గలాట ఆడుకొనేందుకు, గారెలు పంచుకోటానికి, వోణీలు మార్చుకొనేందుకూ, గుళ్ళో కొబ్బరిముక్కలకూ వాళ్ళు పిలుస్తున్నారు. వాగు నవ్వింది. వాగుమీద ఒంటి తాటి బొంత బ్రిడ్డి ఏడ్చింది. చెఱువు చేతులెత్తి సైగలు చేసింది. పాత చీని తోట జాలిగా ఏడ్చి రమ్మన్నది. కాని, రాములుకే మనసు లేదు.

## 7

తోచక కూర్చొన్నది మాలచ్మి. గేట్లు మూసున్నై. నాగపూర్, డేరా డూన్ ఒకే లైను మీదబోయే రాములు గూడ్సుబండి పోతున్నది. గేటు యీవల నుంచొన్న ఆ మనిషెవరు? గొల్లశేషు గాదూ?

"శేసు మామా! శేసు మామా"

మునిలాడు చూసి ఒక్కగంతు వేశాడు.

''మా అమ్మా! మా అమ్మా!! మాలచ్మీ, నువిక్కడున్నావా?'' అని శేసు మావ మూట దింపుకొన్నాడు, శేసుమామ రామేశ్వరం బోతున్నాడంట.

ఆ ర్రాతి శేసు మామ చాలా పొద్దుబోయిందాకా ''సుద్దులు'' పాడాడు. ''హరిహరీ నారాయణా ఆదినారాయణా, కరుణించి మమ్మేలు కమలలోసనుడా'' అని శేసు మామ చెవిమీదకు చెయి బోనిచ్చుకొని ఆలాపన బాడి - సీతమ్మ వనవాసం - కథ చెప్పాడు. లోకం నిందలు బడలేక రాములవారు సీతమ్మను అగ్నిప్రవేశం చెయ్యమంటం, అందులో ఆమె నెగ్గటం, చివరకు భూదేవిని సీతమ్మ ప్రార్థించి తనకు దారి యిమ్మంటం, భూదేవి బీటలు వారగా అందులో సీతమ్మ మాయం గావటం....

మాలచ్మి ఏడ్చింది.

''ఎందుకే....?'' అన్నాడు రాములు.

''మా ఊరు బంపించవా బావా? ఇద్దరం అడకెళ్ళి సుకవడదాం.''

''ఉస్సు. ఆదేముంది? బూడిద.''

మాలచ్మి ఏడవనూ లేదు. మాట్లాడనూ లేదు.

* * *

పొద్దున్నే శేసుమామ పయనం గట్టాడు. ఆ రోజున ఎక్స్ప్రెసు కింద మనిషి బడి చస్తే, ఆ పనికి బోయినాడు రాములు. మాలచ్మి మామను సాగ నంపబోయింది.

''మాఁవా! సీతమ్మ పార్థనకు తల్లి బలికిందా?''

''మరి పలక్కుంటే జానికమ్మ భూమిలో కెట్టాబోయింది?''

శేసుమామ మాలచ్మి వంక వింతగా జూచాడు.

''ఇదుగో, ఆ రైలు కింద బడినే, ఆ మనిషి....ఆమెను మాత్రం తల్లి గాదూ బిలిచింది? సీతమ్మ తల్లి అనుమతి లేందే చీమైనా గుట్టదు.''

''నిజం మావాఁ?!''

''ఇక వుండు మా అమ్మ! మా లచ్మి! చాలాదూరం నడిచావు.''

శేసుమామ రామేశ్వర యాత్ర బోయినాడు.

* * *

మర్నాడు రాత్రి మెయిలు నిన్న ఎక్స్ప్రెసు ఆగినచోటనే ఆగిపోయింది.

"ఆడమనిషి....పాపం, కుర్రది....యిరవై ఏళ్లు గూడా లేవు" అన్నాడు లైటు వేసిన గార్డు.

"గేటుమన్ను పిలవండి."

ఇంతలోనే సిమెంటు ఫ్యాక్టరీ వాచిమేన్ వచ్చి, శవాన్ని చూసి "గేటుమేను పెళ్ళాం బాబూ!" అని పెదిమ కరచుకొన్నాడు.

మాలచ్చిమి కిదేమీ తెలియదు. తను భూదేవిని ప్రార్థించింది - భూదేవి బీటలువారి తనను ఐక్యం చేసుకొంటుందని.

(ఆంధ్రపత్రిక - సచిత్రవార పత్రిక - 11 మార్చి '53)